క్లుప్తంగా

నల్లపరెడ్డికి ఎమ్మెల్సీ మేరిగ పరామర్శ



ప్రసన్నకుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న మేరిగ మురళీధర్

కోట/చిల్లకూరు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇటీవల చేతికి శస్త్రచికిత్స చేయించుకుని నెల్లూరులోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ సోమవారం అక్కడికి చేరుకుని పరామర్శించారు. కోట మండలంలోని రాజకీయ పరిస్థితులపై ప్రసన్నకుమార్‌రెడ్డితో చర్చించారు. వైఎస్సార్ సీపీ కోట మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్ రెడ్డి, వజ్జా రామచంద్రారెడ్డి, రాజారాంరెడ్డి, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు..



గోపితో మాట్లాడుతూ కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : మండలంలోని మేనకూరుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పోతల గోపి తల్లి పోతల పోలమ్మ రెండు రోజుల క్రితం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సోమవారం మేనకూరు దళిత కాలనీలోని గోపి ఇంటికి వెళ్లారు. గోపి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు కట్టా భవాని శంకర్‌రెడ్డి, పాలూరు రాము, మీజూరు బాల, చందు, మధు, దాస్ డేవిడ్, వాకాడు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చెరువు అలుగు పరిశీలన



చెరువు అలుగును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

కలువాయి(సైదాపురం): కలువాయి మండలం కుల్లూరు చెరువు అలుగును సోమవారం అధికారులు పరిశీలించారు. చెరువు అలుగును ఆక్రమించుకుని చదును చేస్తుండడంపై సోమవారం చెరువు కలుజునూ వదలని అక్రమార్కులు అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన వీఆర్వో రామయ్య, సర్వేయర్ నవీన్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. వారు మాట్లాడుతూ అలుగు ప్రాంతాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

సైదాపురం: గూడూరు రూరల్ పరిధిలోని చెన్నూరు, బాలాయపల్లి మండలంలోని కోటంబేడు గ్రామాల్లో సోమవారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ 40 ఏళ్లు దాటిన మహిళలందరూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నియంత్రించవచ్చని తెలిపారు. చెన్నూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎం.జ్యోతి, వైద్యులు హరిత, చైతన్యభాను, సర్పంచులు కృష్ణయ్య, సుప్రజ పాల్గొన్నారు.

కలువాయి విద్యార్థులకు ప్రతిభ అవార్డులు



అవార్డు అందుకున్న జయశేఖర్, సంతోష్

కలువాయి(సైదాపురం): ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన కలువాయి మండలానికి చెందిన విద్యార్థులు సోమవారం ప్రతిభ అవార్డులు అందుకున్నారు. నెల్లూరులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ కె.కార్తీక్ చేతుల మీదుగా శ్రీశివసాయి జూనియర్ కళాశాల విద్యార్థి గురునాథం జయశేఖర్, కలువాయి జెడ్పీ హైస్కూల్ ప్లస్ విద్యార్థి సంతోష్ అవార్డులు అందుకున్నారు. వారిని ఎంఈవో సుధీర్‌బాబు, హెచ్‌ఎం అబ్బాస్ అలీ, కళాశాల ప్రిన్స్‌పాల్ నరేంద్రకుమార్ అభినందించారు.

శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



అర్జీ స్వీకరిస్తున్న ఆరి శంకరయ్య

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరిశంక రయ్య కోరారు. ఆయన సోమవారం ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు పట్టణంలోని ప్రధాన వీధుల్లోనే విధులు నిర్వహిస్తూ ఇతర ప్రాంతాల గురించి పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపాలిటీలో 170 మంది కార్మికులు ఉన్నారని, వార్డుకు ఇద్దరు చొప్పున 25 వార్డులకు 50 మందిని కేటాయించారని తెలిపారు. మిగిలిన వారు ఎక్కడ పనిచేస్తున్నారో తెలియడం లేదని పేర్కొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా నారాయణ

సైదాపురం: సైదాపురం మండల డిప్యూటీ ఎంపీడీవోగా డి.నారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మనుబోలు మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్‌ను కలిశారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



కలువాయి మండలంలోని చీపినాపి చెరువులో కూటమి నేతలు యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. జేసీబీలతో మట్టిని తవ్వి ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ విషయం స్థానిక అధికారులకు తెలిసినా అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. – కలువాయి(సైదాపురం)

పునాదులకే పరిమితం



సైదాపురంలో ఉన్న ఎంపీడీవో కార్యాలయ భవనం పునాదులకే పరిమితమైంది. గతంలో ఎంపీడీవో కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో 2022లో కూల్చేశారు. రూ.1.40 కోట్లతో కొత్త భవనం నిర్మాణం చేపట్టారు. రూ.7.50 లక్షలతో పునాదుల వరకు నిర్మించి వదిలేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అధికారులు, నాయకులు ఎవరూ పనుల గురించి పట్టించుకోవడం లేదు. దీనిపై ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ మాట్లాడుతూ త్వరలో పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – సైదాపురం

మందుబాబులకు నిలయం



మండల పరిషత్ కార్యాలయం ప్రహరీ గోడ అసంపూర్తిగా ఉంది. దీంతో రాత్రిళ్లు మూగజీవాలు కార్యాలయ ఆవరణంలో నాటిన మొక్కలను నాశనం చేస్తున్నాయి. అంతేగాక మందుబాబులకు నిలయంగా మారింది. రాత్రిళ్లు కార్యాలయ ఆవరణలో మద్యం సేవిస్తున్నారు. ఉదయం కార్యాలయానికి వచ్చిన సిబ్బంది, అధికారులు మద్యం సీసాలు, వాటర్ బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లను శుభ్రం చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – ఓజిలి

దినచర్యల్లో యోగా భాగం కావాలి



సైదాపురంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం



కలువాయిలో ర్యాలీ చేస్తున్న అధికారులు

సైదాపురం/కలువాయి(సైదాపురం)/ఓజిలి/తడ/రాపూరు/చిట్టమూరు/వాకాడు: యోగా దినచర్యలో భాగం కావాలని పలువురు అధికారులు తెలిపారు. యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని పేర్కొన్నారు. చేసుకుంటే సంపూరణ ఆరోగ్యం సొంతమవుతుందని అన్నారు. యోగాంధ్రలో భాగంగా సోమవారం వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లో పొదుపు మహిళలు, ఎంపీడీవో కార్యాలయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అవగాహన ర్యాలీ చేపట్టారు. మానవ హారం ఏర్పాటుచేశారు. యోగా చేయడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు.

- సైదాపురంలో ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఏవో మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.
- కలువాయిలో తహసీల్దార్ ఎం.శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఎంఈవో జి.శేషగిరిరావు, డీటీ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రమేష్ పాల్గొన్నారు.
- ఓజిలిలో ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు యోగాంధ్ర ర్యాలీ చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, సీహెచ్‌వో సుబ్బరామయ్య, పంచాయతీ కార్యదర్శి కస్తూరయ్య, నీటి సంఘం అధ్యక్షులు షేక్ ఆయిషా, పాడి వెంకటసుబ్బయ్య, అలిమిలి మల్లికార్జునరెడ్డి, ఎస్‌కే రఫీ, కాటూరు కోటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.
- రాపూరులో ఎంపీడీవో భవాని ఆధ్వర్యంలో సచివాలయ, ప్రభుత్వ ఉద్యోగులు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించి మానవ హారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హౌసింగ్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రామకృష్ణ, వాసు, అంజనేయులు, ఏపీఎం రాధిక, ఏపీవో చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.
- వాకాడులో ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో యోగాంధ్రపై అవగాహన ర్యాలీ చేపట్టారు. యోగా వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సందీప్, నాయకులు విజయశేఖర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.
- చిట్టమూరులో ఎంపీడీవో మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో యోగాంధ్రపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ యోగా చేయడం వల్ల పలు రోగాలు దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో వైద్యుడు సుకేంద్ర, ఏపీఎం గున్నయ్య, ఏపీవో షాలిని, సీహెచ్‌వో బాబురావు, సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు, హైమావతి తదితరులు పాల్గొన్నారు.



ఓజిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి



రాపూరులో అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు

19న జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమం



తడలో యోగాపై అవగాహన ర్యాలీ చేస్తున్న మండల సిబ్బంది

తడలో ఎంపీడీవో శేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈ నెల 14న తడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించే యోగాసనాల కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అదే విధంగా 19న బీవీపాళెం పులికాట్ రిసార్ట్స్‌లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 21న జరిగే యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రఘురెడ్డి, తడ సర్పంచ్ ఆర్ముగం, నాయకులు శశికుమార్, కోదండం, వెలుగు ఏపీఎం రాజారెడ్డి పాల్గొన్నారు.

రాపూరు గ్రంథాలయ అధికారిగా అంజయ్య



రాపూరు: రాపూరు గ్రంథాలయ అధికారిగా అంజయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన వెంకటగిరి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ధనమ్మ సైదాపురం బదిలీ అయ్యారు.

ప్రగతి విద్యార్థుల ప్రతిభ



కలెక్టర్ నుంచి అవార్డులు అందుకుంటున్న ప్రగతి విద్యానికేతన్ విద్యార్థులు

కోట: తమ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించి షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్నట్టు కోటలోని శ్రీ ప్రగతి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ పసుపులేటి కిషోర్ తెలిపారు. తిరుపతి మహతిలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా పి.సాత్విక్, జి.అక్షిత, ఎం.రిత్విక్ అవార్డులు, రూ.20 వేల చొప్పున నగదు పురస్కారం అందుకున్నట్లు తెలిపారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

తడ: ఏపీ మోడల్ స్కూల్‌లో 6, 7, 8 తరగతుల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సౌజన్య తెలిపారు. జూన్ 24న అక్కంపేట మోడల్ స్కూల్‌లో పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హత కల విద్యార్థులు 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిట్టమూరు : మండలంలోని యాకసిరి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ పోలయ్య తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సరఫరా నిలిపేస్తున్నట్టు తెలిపారు. అలాగే వ్యవసాయానికి సంబంధించి 9 గంటల త్రీ ఫేస్ సరఫరా రాత్రికి ఇస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కలువాయి(సైదాపురం): మండలంలోని రాజుపాలెంలోని పరమానంద ఆశ్రమంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు చినస్వామి తెలిపారు. ప్రతి రోజూ హోమాలు, వేద పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం, పలు కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ఛత్రపతి శివాజీకి నివాళి

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద సోమవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఎఫ్, వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిమ్మలో యాజమాన్య పద్ధతులపై అవగాహన ఉండాలి

దక్కిలి : నిమ్మ పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయశ్రీ తెలిపారు. దక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నిమ్మ సమగ్ర యాజమాన్యం, ఖరీఫ్ పంటలకు సంబంధించి నూతన సాంకేతిక విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భారతీయ వరి పరిశోధనా సంస్థ హైదరాబాద్ శాస్త్రవేత్తలు బండెప్ప, గ్రామ సర్పంచ్ రత్నయ్య పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్, జేవీవీ ప్రతినిధులు

చిల్లకూరు : గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని, కాన్పు సమయంలో రక్తహీనత రాకుండా ఉంటుందని గూడూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా తెలిపారు. ఆస్పత్రికి సోమవారం పరీక్షలకు హాజరైన గర్భిణులకు మధ్యాహ్నంవాకాటి రామ్మోహన్ రావు దాతృత్వంతో భోజనం అందించారు. ఆమె మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక సభ్యులు కొన్నేళ్లుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ప్రతినెలా పరీక్షల కోసం ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, వాకాటి రామ్మోహన్‌రావు, చెంచునారాయణ, పురుషోత్తమరావు, ప్రభాకర్, ఆనంద్, సురేష్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు



యర్రగుంట కాలువ పోరంబోకు భూముల్లో పెట్టిన హెచ్చరిక బోర్డు

పెళ్లకూరు: మండలంలోని యర్రగుంట రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నంబరు 235లోని ప్రభుత్వ భూముల్లో సోమవారం రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గ్రామంలో సుమారు 90 ఎకరాలకు పైగా కాలువ పోరంబోకు భూములు ఉన్నాయి. వీటిని కొంతమంది స్థానికులు కొంత కాలంగా సాగు చేసుకుంటున్నారు. ఇటీవల తాళ్వాయిపాడు గ్రామానికి చెందిన ఒక భూస్వామి ఒక్కో ఎకరం రూ.80 వేల చొప్పున సుమారు 15 ఎకరాలు కొనుగోలు చేశారు. ఆ భూముల్లో చెరువు నుంచి మట్టి తవ్వి లెవలింగ్ పనులు చేస్తున్నారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. సంబంధిత కాలువ పోరంబోకు భూముల్లో ఎవరూ ప్రవేశించరాదని, అలా ప్రవేశించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

చిల్లకూరు : గూడూరు మండలం చెన్నూరు ప్రాంతంలో ఈ నెల 3వ తేదీన దళితులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వారు సోమవారం గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఆలిండియా ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ జాతీయ అధ్యక్షుడు డేగా రవి రాఘవేంద్ర మాట్లాడుతూ గూడూరు మండలం చెన్నూరు ప్రాంతానికి చెందిన అద్దంకి శ్రీనివాసులు అనే దళిత యువకుడు ఐస్ బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. బీసీ కాలనీకి చెందిన ఇద్దరు యువకులు ఈ నెల 3వ తేదీన ఐస్ బండి వద్దకు వచ్చి ఐస్ అడిగిన సమయంలో చిన్నపాటి వివాదం ఏర్పడిందని తెలిపారు. దీంతో శ్రీనివాసులు, అతని తమ్ముడు పెంచలయ్యపై దాడి చేసి గాయపరిచారని తెలిపారు. పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేసి మిన్నకుండి పోవడం ఏమిటని నిలదీశారు. కేసును హత్యాయత్నంగా మార్చా దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న గూడూరు డీఎస్పీ గీతాకుమారి పోన్‌లో డేగా రవి రాఘవేంద్రతో మాట్లాడారు. దళితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. నాయకులు వేగూరు విజయకుమార్, గోవిందు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అన్ రేటెడ్ ప్లేయర్‌గా డమరేషన్



డమరేషన్‌ను అభినందిస్తున్న నిర్వాహకులు

వెంకటగిరి రూరల్ : ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు నక్షత్ర స్కూల్‌లో సోమవారం నిర్వహించిన నేషనల్ లెవల్ చెస్ టోర్నమెంట్‌లో బెస్ట్ అన్ రేటెడ్ ప్లేయర్‌గా వెంకటగిరికి చెందిన కలవ డమరేషన్ ప్రథమ స్థానంలో నిలిచినట్టు చెస్ అకాడమీ నిర్వాహకుడు వినయ్ తెలిపారు. ఆలిండియా ఓపెన్ చెస్ క్రీడా పోటీలకు ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి 234 మంది క్రీడాకారులు పాల్గొన్నారని వెల్లడించారు. వీరిలో వెంకటగిరికి చెందిన డమరేష్, అండర్ –12 బాలికల విభాగంలో నైనిక 5వ స్థానం, అండర్ 16 విభాగంలో కీర్తన 2 స్థానంలో ప్రతిభను చూపినట్టు తెలిపారు. కలవకొల్లు మధు శ్రీతన్ 1600 ఇంటర్నేషనల్ రేటెడ్ ప్లేయర్‌ను ఓడించారని తెలియజేశారు.

స్టీల్ ప్లాంట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

చిల్లకూరు : విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచ అన్యాయంగా తొలగించిన 4,500 మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. వారు సోమవారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ వద్దనున్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకుడు బీవీ రమణయ్య మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటు పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుంటే అడ్డుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మిన్నకుండిపోయిందన్నారు. ముడి సరుకు రవాణా చేయకుండా ప్లాంట్ నష్టాల్లో నడుస్తోందని సాకు చూపి ఉద్యోగులను తొలగించడం దారుణమన్నారు. అనంతరం ర్యాలీగా గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం చేరుకున్నారు. అక్కడ డీఏవో శిరీషకు వినతి పత్రం అందించారు. పట్టా శంకరయ్య, బి.రమేష్, భాస్కరరెడ్డి, నారాయణ, ఎస్.ముత్యాలయ్య, అశోక్, సందీప్, మదన్, శీను, చంద్రయ్య, డేవిడ్ పాల్గొన్నారు.

కార్మికులను తొలగించడం దారుణం

నాయుడుపేట టౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమలో పనిచేస్తున్న సుమారు 4,500 మంది కార్మికులను విధుల నుంచి తొలగించడం దారుణమని సీఐటీయూ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు సోమవారం నాయుడుపేట రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకుడు ముకుంద మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణలో భాగంగానే వేలాది మంది కాంట్రాక్టు కార్మికులను విధుల నుంచి తొలగిస్తున్నారని దుయ్యబట్టారు. కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ స్వర్ణలతకు వినతి పత్రం అందించారు. నాయకులు అబ్దుల్లా, వెంకయ్య, పుట్టయ్య, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని తమ ఖాతాలో వేసుకోవడానికే..

- పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం
- ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్యే గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేట కార్యక్రమం
- పెదవి విరుస్తున్న స్థానికులు

సూళ్లూరుపేట : ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సూళ్లూరుపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. నిధులు కూడా కేటాయించారు. ఈ క్రమంలో ఆయా పనులను తమ ఖాతాలో వేసుకోవడానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఉన్నట్టుండి గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేట కార్యక్రమం చేపట్టారు. సోమవారం 18వ వార్డు పరిధిలో నిగాండ్లవీధిలో పర్యటించారు. ఈ ప్రాంతంలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించేందుకు ఇటీవల మున్సిపాలిటీ రూ.10 లక్షలు మంజూరుచేసింది. అదే విధంగా ఇతర ప్రాంతాల్లోనూ అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. ఈ పనులను తన ఖాతాలో వేసుకునేందుకు ఎమ్మెల్యే పర్యటన చేపట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా గ్రాంట్ రాకపోగా మున్సిపల్ సాధారణ నిధులతో చేసే పనులను తాము చేసినట్టు గొప్పలు చెప్పుకునేందుకు గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేట ప్రోగ్రామ్‌కు తెర తీశారన్న ఆరోపణలు వెల్లవెత్తుతున్నాయి. పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సామాన్యులు కూడా నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ఉత్తుత్తి గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేట వల్ల ప్రయోజనం ఉండదని చెబుతున్నారు.

18వ వార్డులో గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేట

సూళ్లూరుపేట : ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సోమవారం సూళ్లూరుపేట మున్సిపాలిటీలోని 18వ వార్డులోవున్న గాండ్లవీధిలో గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు మాట్లాడుతూ కాలువల్లో మురుగు పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెంది ఇబ్బంది పడుతున్నట్టు తెలిపారు. స్పందించిన ఆమె సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్‌ఐ

బాలాయపల్లి(సైదాపురం) : పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని వెంకటగిరి సీఐ ఏవీ రమణ హెచ్చరించారు. ఆయన సోమవారం తమ సిబ్బందితో కలిసి మండలంలోని మేల్చూరు గ్రామంలో కార్డన్ సర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్న పిలలకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు గోపి, లక్ష్మీభవాని తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న మేరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం దాతలు అన్నదానం చేశారు. నిరాశ్రయులైన వృద్ధులతో కలిసి భోజనంచేయడం ఆనందంగా ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో రాజేష్‌రెడ్డి, ప్రత్యూష దంపతులు, ఆయాన్ష్ రెడ్డి,ఆశ్రమనిర్వాహకులు సునితబెన్ని పాల్గొన్నారు.